కథ

జీవితానికి నేనో అంతు చిక్కని ప్రశ్నను. అది ఎన్ని సమాధానాలైనా వెతుక్కోనీ, నేను మాత్రం ఎప్పుడూ ఒక ప్రశ్ననే.
'కాలం ఆవలి గట్టున కూర్చుని' తీరిగ్గా చూస్తోంది, నా ప్రశ్నకేమైనా సమాధానం దొరుకుతుందేమో, నేను తనకి దొరక్కుండా పోతానా అని. అది కదలదు, అలాగని వదలదు.
దిగుడుబావి మెట్ల మధ్య కూర్చొని మ్యావ్, మ్యావ్... అని అరుస్తోంది వేదనగా ఓ పిల్లికూన, పైకి రాలేక, కిందికి దిగలేక. తాడేసి లాగుదామంటే, తాడు పట్టుకోవడం దానికి తెలీదు, కిందకి దిగెళ్లి తీద్దామంటే, నన్ను చూసి బెదిరి నీళ్లల్లోకి దూకేస్తుందేమో అనే మీమాంస.
వీరన్న జీవితమంతా లంగరు, తెడ్డే. ఊహ తెలిసినప్పటి నుండీ తన అయ్యతో కలిసి పడవపై తెడ్డు వేస్తూ, లంక దాటించడమే తన పని. పొద్దుగూకిన తరువాత ఇంటికెళ్లేటప్పుడు మాత్రం




# లంగరు

- లక్కోజు ఉషశ్రీ


కాసేపు ఆ
ఏటి ఒడ్డున అయ్య తువాలుతో చేపలు పట్టేవాడు.
వీరన్నకు తెలిసి అదొక్కటే ఆట. కడుపు నిండడానికైనా, కునుకు పట్టడానికైనా.
కాలం కూడా అంతే. వీరన్న జీవితాన్ని తన సంకెళ్లతో బంధించలేదు, అలాగని కర్కశాలతో కబళించలేదు.
వయసు ఆగదు కదా, పద్దెనిమిదేళ్లకే అయ్య పెళ్లి చేసి పారేశాడు. ఏడాది తిరక్కుండా ఓ బిడ్డకు తండ్రి కూడా అయిపోయాడు.
వీరన్న తండ్రికి జబ్బు చేసి పడవ నడపడానికి పనికిరాకుండా పోయినందుకు, తనే పడవ నడుపుతున్నాడు, అలవాటైన పనే కదా. సాయంత్రమయ్యేసరికి ఇరవయ్యో, ముప్పయ్యో వచ్చేవి, మధ్యమధ్యలో ఏటి గట్టున తనకు వచ్చిన ఆట, అదే చేపల వేట ఎలాగూ ఉంది కదా... రోజుల్లో పెద్ద మార్పేమీ ఉండేది కాదు.
కాలం తన మానాన్న తను పోక ,వీరన్న జీవితాన్ని కన్నార్పకుండా చూస్తోంది.

వీరన్న కొడుకు సైదులుకి పదేళ్లొచ్చాయి. వాడు కూడా తండ్రి వెనకే తోకలా, పడవపై తెడ్డేసేవాడు.
ఓ రోజు తెచ్చుకున్న మధ్యాహ్నభోజనం తినేసి, తాతతో పాటు అయ్యకి, అయ్యతో పాటు తనకీ, అలవాటైన చుట్టతీసి నిప్పంటించి తీరిగ్గా పొగ వదులుతూ, ఏటి అలలు చూస్తూ ఏదో ఆలోచించ సాగాడు.
ఇంతలో ఏదో కాలిన వాసన, తల తిప్పి చూస్తే పడవకున్న తెర చాప కాలిపోతూ కనిపించింది. ఏటి గట్టున సైదులు బిక్కమొహం వేసుకుని కనిపించాడు.
తాతల నాటి పడవ అది, తెర చాప కూడా అప్పటిదే... చుట్ట నీటిలో పారేసి ఒక్క ఉదుటున పరుగెత్తి, చెట్టు కింద ఉన్న కుండతో తెర చాపపై నీళ్లు పోశాడు, కొద్దిసేపుంటే పడవ కూడా తగలబడిపోయేదే!
వీరన్నకు కోపం ఆగలేదు. తెలీనితనం వాడిది, తెలీని ఆవేశం వీరన్నది!
అంతే! కొడుకు వీపుపై అక్కడే వున్న తెడ్డుతో ఒక్కటేశాడు.
కాలం కళ్లు చిట్లించి అలాగే చూస్తోంది.
ఇప్పటి వరకూ ఒంటిపై ఒక్క దెబ్బ కూడా పడని సైదులుకి, ఆ దెబ్బ చాలా గట్టిగానే తగిలి, గిలగిలలాడిపోయాడు. భయంతో ఊర్లోకి ఒక్కటే పరుగందించుకున్నాడు. ఇంటికెళ్లితే అయ్య మళ్లీ కొడతాడేమో...! అదే ఉండిపోయింది ఆ చిన్న బుర్రలో.
ఎంత వెదికినా కొడుకు జాడ తెలీక ఇంటిముఖం పట్టాడు వీరన్న.
కొడుకు కానరాకుండా పోయినందుకు, సుబ్బమ్మ, వీరన్నపై రోజూ శివాలెత్తేది. ఉన్న ఒక్కగానొక్క కొడుకునే గూడు వదిలిపోయేట్టు చేశావని... నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టేది.
సీక్వెన్సీ ఆటలో షో అయిపోయినా ముక్క తిప్పలేని పరిస్థితి!
కొడుకు గురించి తనకు మాత్రం లేదా బాధయ ఎటూ మాట్లాడలేక, ఏటిగట్టుకు వెళ్లిపోయేవాడు. ఒక్కోసారి రేయి కూడా అక్కడే జారేది.,
పదేనేళ్లు గడిచాయి. కాలం తన పెత్తనం తాను చేసుకుపోతోంది.

వీరన్న జీవితంలో మార్పు లేదు.
ఎదురుగా తెల్లగులాబి మొక్క, గుత్తులు గుత్తులుగా పూలు... ఎంత ఆనందం...ఎంత పులకింత!
చూడు చూడు అంటోంది.
వీరన్నకు ఇవేమీ పట్టవు. ఎప్పుడూ రావిచెట్టు మొదట్లో, చినిగిన పంచె, చింపిరి జుట్టు. శూన్యంలోకి చూసే పిచ్చి చూపు.
ఈ అందాలేవీ వీరన్న కంటికి ఇంపుగా కనిపించవ్...చిలకపచ్చ, హంస తెలుపు, కాకి నలుపు ఇవేమీ అతని మదికెక్కవ్. అసలు అందం అనే ఆలోచనే రాదు.
వెంట్రుకలు అక్కడక్కడా మెరిసినా, కాలం కోరచూపులకి మెలితిరిగిన మీసం కిందికి దిగలేదు.
పడవ తియ్యమని, రేవు దాటించమని ఎవరో ఒకరు రాకపోతారా అనే ఎదురుచూపు తప్ప...

"అయ్యా... నీ మీద నాకేం కోపం లేదు... అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు... నువ్వు కొట్టిన దెబ్బకి నేను భయపడి పారిపోతే ఒక అయ్య నన్ను చేరదీసి చదువు చెప్పించాడు. ఇప్పుడు పట్నంలో ఉద్యోగం కూడా వచ్చింది, అందుకే అమ్మనూ, నిన్నూ పట్నం తీసుకెళ్లిపోదామని వచ్చానయ్యా..." అన్నాడు సైదేశ్‌గా మారిన సైదులు.
"పదరా అయ్యా, బేగి ఇంటికెళ్దాం, మీ అమ్మ శానా సంతోసిత్తది" అన్నాడు వీరన్న, పట్టలేని సంతోషంతో.
ఇద్దరు రేవు దాటారు. కాలం కళ్లెర్రజేయబోయింది.
తల పైకెత్తి, మీసం దువ్వాడు.

చేతిలో చుట్ట చురుక్కుమంది, దీనబ్బ అప్పుడే అయి చచ్చింది! అనుకుంటూ అది విసిరేసి, మరో చుట్ట కోసం ఆకు చుట్టడం ప్రారంభించాడు తదేకధ్యాసతో.
రేవు దాటడానికి ఒక్కరూ రాలేదు. బొడ్లో చుట్టిన పైసలు తీసి లెక్క చూశాడు! మొత్తం పది రూపాయలున్నాయ్
"ఇంటికెట్టా పోవాల? ఈ పైసలకేటీ రావు, ఒక బీడీ కట్ట తప్ప..." అనుకున్నాడు.
హు! కాలం మళ్లీ పళ్లికిలించింది, తెడ్డు పెట్టి ఒక్కటేద్దామా అనిపించింది.
ఎండ చుర్రుమంటోంది, టైమెంతయ్యిందో, సూర్యుణ్ని చూస్తుంటే రెండు దాటిందేమో. వీరన్నకు కడుపులో ఆకలి కరకరమంది.
చెట్టుకొమ్మకి తగిలించిన సత్తు టిఫిన్ క్యారియర్ తీసి, పచ్చిపులుసు, చింతకాయ పచ్చడి., ఆబగా తినేశాడు. చెయ్యి కడుక్కొచ్చి, టిఫిన్ క్యారియర్ కడిగి చెట్టు కింద బోర్లించి, భుజంపై ఉన్న తుండు తీసి, అక్కడే నీడలో పరుచుకుని నడుం వాల్చాడు. తలపై చెయ్యి పెట్టుకుని చెట్ల కొమ్మల జాడల్లోంచి ఆకాశాన్ని చూస్తూ, "నా చిన్నప్పట్నించీ ఇంతే. అది మారదు నా జీవితంలా" అనుకున్నాడు స్వగతంగా.
పదేనేళ్ల క్రితం కోపంతో కొడితే పారిపోయిన కొడుకు గుర్తొచ్చాడు.
ఇప్పటికీ అర్థం కాదు తప్పెవరిదో. ఇంటికెళ్తే ఎక్కడున్నాడో, ఏం చేత్తన్నాడో అని ఇల్లాలి సొద.
పొద్దు గుంకింది. "ఈ రోజు ఎవరి మొకం చూశానో! ఒక్కళ్లూ రాలేదు, రేపు దాటించమని. ఏం చేద్దాం? పది రూపాయలతో అరకిలో బియ్యం వత్తాయి.
పైపంచె తీసి రేవులోకి దిగాడు. నీటి మధ్యలోకెళ్లి, పంచెను రెండు కొనలనూ రెండు చేతులతో పట్టుకుని, నీళ్లలో పైకీ, కిందికీ ఆడించాడు. పంచెలో రెండు కొర్రమట్టలు పడ్డాయ్. "ఈ రోజుకి కియ్యి చాలు" అనుకున్నాడు.
కాలం జీను లేని గుర్రంలా వెనక్కివెనక్కి తొంగి చూస్తోంది.
ముసిముసిగా నవ్వుకున్నాడు!
ఒడ్డుకొచ్చి టిఫిన్ క్యారియర్ సర్ది, చేపలు అట్టాగే మూట కట్టి, పడవ వైపు రెండడుగులు వేశాడు!
ఎవరిదో చెయ్యి భుజంపై పడింది.
వెనక్కి తిరిగి చూశాడు.
"రేవు దాటిస్తావా...? అయ్యా..."
'ఎవరూ... ఎవరు బాబూ మీరు? మిమ్మల్నెప్పుడూ ఈ ఊర్లో చూసిన జాడ లేదయ్యా!" అన్నాడు.
"నేనయ్యా, నన్ను గుర్తు పట్టలా నువ్వు? నీ కొడుకుని, నీ సైదులుని..." అన్నాడు సైదేశ్.



ఆశ్చర్యంతో అవాక్కయి అట్టాగే నిల్చుండిపోయాడు. ఎదురుగా, చెట్టంత ఎత్తు, తన కొడుకా? ఆ చీమిడి ముక్కు, చినిగిన నిక్కరు లేవు. ప్యాంటూ, బెల్టూ, టీ షర్టు, బూట్లు... శానా స్టయిలు గున్నాడు.
"అరే నాన్నా సైదులూ...!" అన్నాడు ఆర్తిగా.
"ఇప్పుడు నా పేరు సైదులు కాదయ్యా... సైదేశ్" అన్నాడు సైదులు.
"అవునా అయ్యా...! ఎక్కడికెళ్లి పోయావురా, మమ్మల్నిడిచి? రోజూ మీ అమ్మతో గొడవేరా... నన్ను చమించరా బిడ్డా.... నిన్ను ఆ నాడు అలా కొట్టినందుకు..."
"అయ్యా... నీ మీద నాకేం కోపం లేదు... అప్పుడూ లేదు, ఇప్పుడూ లేదు... నువ్వు కొట్టిన దెబ్బకి నేను భయపడి పారిపోతే ఒక అయ్య నన్ను చేరదీసి చదువు చెప్పించాడు. ఇప్పుడు పట్నంలో ఉద్యోగం కూడా వచ్చింది, అందుకే అమ్మనూ, నిన్నూ పట్నం తీసుకెళ్లిపోదామని వచ్చానయ్యా..." అన్నాడు సైదేశ్‌గా మారిన సైదులు.
"పదరా అయ్యా, బేగి ఇంటికెళ్దాం, మీ అమ్మ శానా సంతోసిత్తది" అన్నాడు వీరన్న, పట్టలేని సంతోషంతో.
ఇద్దరు రేవు దాటారు. కాలం కళ్లెర్రజేయబోయింది.
తల పైకెత్తి, మీసం దువ్వాడు.
కాలం ఇంకేం చేయలేక కాలుగాలిన పిల్లిలా అక్కడే తిరగసాగింది.
తరిగిపోతుందనుకున్న తరం, తిరిగి కొత్త పోకడతో పెరగడం ప్రారంభించింది.